ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

గురువారం 13 ఫిబ్రవరి 2025



సమరానికి సన్నద్ధం



- మండల, జిల్లా పరిషత్ ఓటర్ల ముసాయిదా ప్రదర్శన
- 13 వరకు అభ్యంతరాలు, 15న తుది జాబితా
- ఆర్ఓలు, ఏఆర్ఓలకు శిక్షణ పూర్తి, స్టేషనరీకి టెండర్లు
- స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై నేతల్లో ఉత్కంఠ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సమరానికి జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధం అవుతున్నది. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితా ఇప్పటికే పూర్తి కాగా, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల ఓటర్ల ముసాయిదా జాబితాను ఈ నెల 10వ తేదీన మండలాల్లో ప్రదర్శించారు. ఈ నెల 13వ తేదీ వరకు ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి 14న పరిష్కరించనున్నారు. 15న తుది జాబితాను విడుదల చేయనున్నారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను నిర్వహించే రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. జిల్లాలో మొత్తం 14 మండలాలు ఉండగా, అందులో రామగుండం అర్బన్ మండలం పోనూ మిగతా 13 మండలాలకు 13 జడ్పీటీసీలు, 140 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో జడ్పీటీసీ స్థానాలకు 13 మంది ఆర్ఓలు, 13 మంది ఏఆర్ఓలను నియమించారు. మూడు, నాలుగు ఎంపీటీసీ స్థానాలకు కలిపి ఒక క్లస్టర్ చొప్పున మొత్తం 46 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక రిటర్నింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని నియమించారు. రిజర్వులో నలుగురి చొప్పున నియమించారు. వీరందరికీ శిక్షణ ఇచ్చారు. మండల, జిల్లా పరిషత్ పరిధిలో మొత్తం 4,13,306 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 2,03,366 మంది, మహిళలు 2,09,927 మంది, ఇతరులు 13 మంది ఓటర్లు ఉన్నారు. 140 ఎంపీటీసీ స్థానాలక ఎన్నికలు నిర్వహించేందుకు గాను ప్రతి 500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ చొప్పున 754 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఓటర్ల జాబితాపై వచ్చే అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత ఓటర్ల సంఖ్యలో చిన్న చిన్న మార్పులు చోటు చేసుకోనున్నాయి.

● జిల్లాలో 266 పంచాయతీలు

జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటికి ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా పంచాయతీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయగా, స్టేషనరీ కొనుగోళ్లకు టెండర్లు నిర్వహించారు. 266 పంచాయతీల్లో 2,462 వార్డులుండగా, అంతే మొత్తంలో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. స్టేజీ-1లో 109 ఆర్ఓలు, 109 ఏఆర్వోలు, స్టేజీ -2లో 315 మంది ఏఆర్ఓలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. బ్యాలెట్ బాక్సులను కూడా సిద్ధం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలకు ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించినా నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉన్నారు. పంచాయతీ శాఖ జిల్లా అధికారి నుంచి మొదలుకుని సిబ్బంది అంతా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పనుల్లోనే నిమగ్నమై ఉన్నారు.

● ఇంకా ఖరారు కాని రిజర్వేషన్లు

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది. అంతేగాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేస్తామని ప్రకటించింది. ఆ మేరకు కులగణన పూర్తి చేసి

మిగతా 8వ పేజీలో...

పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ పరిశీలించారు. బుధవారం ఆయన పలు వార్డుల్లో పర్యటించారు. మున్సిపల్ సిబ్బంది పనులను పరిశీలించారు. పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటింటికి వచ్చే మున్సిపల్ సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. డ్రైనేజీలలో ఎలాంటి చెత్త చెదారాన్ని కవర్లను వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు.

పుట్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుపై ఊడిపడిన పెచ్చులు

చర్చనీయాంశంగా సెక్రటేరియట్ ఘటన

పాలకుర్తి,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిలో సెక్రెటేరియట్ వద్ద బుధవారం పెచ్చులు ఊడిపడిన ఘటన రామగుండంలో చర్చనీయాంశంగా మారింది. రామగుండం మండల పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లికి చెందిన గాలిపెల్లి (గడ్డం) తిరుపతి ఇటీవల పుట్నూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించారు. బుధవారం పనిమీద సెక్రెటేరియట్‌కు వెళ్లారు. తన కారును పార్కింగ్ చేయగా సెక్రెటేరియట్ రెయిలింగ్ పెచ్చులు ఊడి గాలిపెల్లి తిరుపతి కారుపై పడ్డాయి. ప్రసార మాధ్యమాల ద్వారా ఈ విషయం తెలియడంతో స్థానికంగా చర్చ జరుగుతోంది. దీనిపై మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపెల్లి తిరుపతిని ఫోన్‌లో సంప్రదించగా తాను గానీ, తనతో ఉన్నవారు గానీ కారు వద్ద లేక పోవడంతో ప్రమాదం తప్పిందన్నారు.

గృహ అవసరాలకు నూతన మట్టి పాలసీ



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎండీ వకీల్

ధర్మారం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) గృహ అవసరాల కోసం నూతన మట్టి పాలసీ తీసుకువచ్చినట్టు ధర్మారం తహశీల్దార్ ఎం.డి. వకీల్ తెలిపారు. మట్టి అవసరాల కోసం ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కలెక్టర్ కోయా శ్రీ హర్ష నూతన పాలసీని తీసుకు వచ్చినట్లు వకీల్ పేర్కొన్నారు. మట్టి, మొరం అవసరం ఉన్న వారు కలెక్టర్ పెద్దపల్లి పేరుమీద గానీ, తహశీల్దార్ ధర్మారం పేరు మీద గానీ డీడీ లేదా చలాన్ తీసి మట్టి పర్మిషన్ తీసుకోవచ్చని అన్నారు. ట్రాక్టర్‌కు 2 వందలు, టిప్పర్ అయితే 8 వందల రూపాయలు చెల్లించాలని సూచించారు. పర్మిషన్ తీసుకున్న వారు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిదినాల్లో మాత్రమే మట్టి తీసుకోవచ్చని తెలిపారు. సొంత స్థలాల్లో మట్టి తీసుకునే వారు కూడా పట్టదారు పాస్‌బుక్‌తో పాటు సంబంధించిన రుసుము చెల్లించాలని వకీల్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి 12,(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాల్వశ్రీరాంపూర్, ఓదెల సెక్టోరల్ ఆఫీసర్, తహసీల్దార్ జగదీశ్వర్‌రావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మట్లాడుతూ కాల్వశ్రీరాంపూర్‌లో 1,538మంది పట్టభద్రులు ఉండగా 21మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. కాల్వశ్రీరాంపూర్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు, ఓదెలలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అవయవ దానంపై విద్యార్థులకు అవగాహన

జూలపల్లి, ఫిబ్రవరి 12. (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో బుధవారం సదాశయా ఫౌండేషన్, ప్రిన్స్‌పాల్ ఎండి షాదుల్ ఆధ్వర్యంలో నేత్ర,అవయవ,శరీర దానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, కార్యదర్శి బీష్మాచారి పలువురు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల ముందస్తు అరెస్టు

జూలపల్లి, ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి): కులగణనలో మున్నూరు కాపు కులస్తుల వివరాలు, సంఖ్యను ప్రభుత్వం కావాలని తక్కువ చేసి చూపిందని ఆరోపిస్తూ మున్నూరు కాపు సంఘం నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని ప్రకటించిన నేపథ్యంలో బుధవారం మండలంలోని మున్నూరు కాపు కులస్థులను ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఇందులో నాయకులు కొప్పుల మహేష్, దండె వెంకటేశ్వర్లు, న్యాడెం శ్రీదర్, బండి రాజయ్య, గుమ్మడి శంకరయ్య తదితరులు ఉన్నారు.

గోపాల్‌పూర్‌లో యూరియా వినియోగంపై అవగాహన

మంథనిరూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్ పూర్‌లో యూరియా వినియోగంపై రైతులకు బుధవారం వ్యవసాయ అధికారులు అవగాహణ కల్పించారు. నానో యూరియాను డ్రోన్ ద్వారా రైతు పొలంలో ప్రయోగాత్మకంగా నిర్వహించారు. దీని ద్వారా రైతులకు సాగు ఖర్చు తగ్గించుకొని దిగుబడి పెంచుకోవచ్చునని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అంజని, ఏవో నవ్య పాల్గొన్నారు.

మడిపల్లిలో బోగస్ ఓట్లు తొలగించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లి గ్రామంలో ఉన్న బోగస్ ఓట్లు తొలగించాలని కోరుతూ గ్రామస్థులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ వడికొప్పుల రాణిమోహన్ మాట్లాడుతూ మడిపల్లి గ్రామంలో నివాసం లేనివారి 30మంది పేర్లు తప్పుగా నమోదు చేశారన్నారు. గ్రామంలో 2024డిసెంబర్ వరకు ఆధార్‌కార్డు సొంత ఇల్లు కూడా లేదని 131బూత్ నంబర్ 30మంది బోగస్ ఓటర్లను చేర్చారన్నారు. ఈ విషయంపై సంబంధిత ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపి అక్రమంగా బోగస్ ఓటర్లు నమోదు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సూత్రాల శ్రీనివాస్, మహమ్మద్ ఫరీద్, పిట్టల శ్రీనివాస్, కల్లెపల్లి శ్రీనివాస్, గాజుల అజయ్ తదితరు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజానికి సేవలు అందించాలి

● మున్సిపల్ మాజీ చైర్మన్ మమతారెడ్డి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిజాయతీగా చదివి సమాజానికి నిస్వార్థంగా సేవలు అందించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మమతారెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఫార్మసీ కళాశాలలో బుధవారం జరిగిన ఫార్మసీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఫార్మసీ విద్యార్థులుగా, ఇటు డాక్టర్లుగా సమాజానికి వైద్యసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు చూరగొని సమాజసేవకులుగా గుర్తింపబడతారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.ప్రభాకర్, ఏవో శ్రీనివాస్‌తో పాటు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి స్థలాలు పరిశీలించిన ఎమ్మెల్యే



అబ్బిడిపల్లి రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ రమణారావు



పెద్దపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

ఓదెల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం నుంచి అబ్బిడిపల్లి మీదుగా కాల్వ శ్రీరాంపూర్ మండలం కేంద్రం వరకు నిర్మించనున్న బీటి రోడ్డును బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు పరిశీలించారు. అబ్బిడిపల్లి నుంచి నేరుగా నిర్మితం అవుతున్న రోడ్డు మల్లికార్జున స్వామి ఆలయానికి వీధి పోటు, వాస్తు దోషం లేకుండా రోడ్డు మరో వైపు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో భూములను కోల్పోయే రైతులతో మాట్లాడిన తర్వాత రోడ్డు పనులు కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఓదెల తారకరామా కాలనీ (మందోడిగడ్డ) సమీపంలోని రైల్వే లైన్ కింది నుంచి వ్యవసాయ భూముల మీదుగా డి 86 ప్రధాన ఎస్సారెస్పీ కాల్వ వరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నందుకు వ్యవసాయ భూములను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రైల్వేలైన్‌కు ఆటంకం లేకుండా నిర్మించే రోడ్డు స్థలాలను పరిశీలించారు. అలాగే భూములను కోల్పోయే రైతులతో మాట్లాడిన అనంతరం పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, చీకట్ల మొండయ్య,చింతం కుమారస్వామి, వంగ రాజమల్లు, నాగపూరి రవిగౌడ్, గుండేటి ఐలయ్య, ఆసంశెట్టి కృష్ణ, చొప్పరి రాజన్న, రజనీకాంత్ ఉన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే

పెద్దపల్లి కల్చరల్: పెద్దపల్లి పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించి ఆలయ కమిటీ సభ్యుల ఆలోచన మేరకు, భక్తుల సౌకర్యం కోసం ఆలయాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. భక్తులు, పట్టణ ప్రజలు పార్టీలకు అతీతంగా ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ పట్నాల మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్: మండలంలోని మారేడుగొండ గ్రామంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి పట్నాల మహోత్సవ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న బీజేపీ నాయకులు



ఎల్లమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఏగోలపు సదయ్య గౌడ్

పెద్దపల్లి రూరల్ , ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేడుగొండ గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకా ఎల్లమ్మ తల్లి పట్నాల కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్‌తో పాటు బీజేపీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట గౌడ కులస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన బీసీ గురుకుల విద్యార్థులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12: (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ బీసీ గురుకుల విద్యార్థులు సత్తాచాటుకున్నారు. మహాత్మా జ్యోతి బాపులే గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న రవితేజ 93.48, సిద్ధార్థ 88.84తో పాటు ఇతర విద్యార్థులు మంచి పర్సంటైల్ సాధించారని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశం తెలిపారు. విద్యార్థులను బుధవారం సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డితో పాటు జ్యోతిబాపూలే ఆర్‌సీఓ అంజలి కుమార్, డీసీఓ మణిదీప్తి, ప్రిన్సిపాల్ రాజేశం తదితరులు అభినందించారు.

ఆటలతో ఆరోగ్యం

మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టిసారించాలని, ఆటలతో ఆరోగ్యంగా ఉంటారని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట బుధవారం యువకులకు షటిల్ బ్యాట్లు, ఇతర క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. చిన్నతనం నుంచే ఆటలు ఆడితే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇష్టం ఉన్న క్రీడల్లో ఆడి గుర్తింపు పొందాలన్నారు. అవసరమైన క్రీడా సామగ్రి అందిస్తానన్నారు. క్రీడలతో దేహదారుఢ్యం పెరుగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ధ్యాగేటి రాంచందర్, కాంగ్రెస్ నాయకులు శివరామకృష్ణ, తాండ కృష్ణ, సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కులగణన తప్పుల తడక

● మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీలను అణగదొక్కేందుకే రేవంత్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నాడని, అత్యధిక జనాభా కలిగిన బీసీలను అనుగదొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరుతో సర్వే చేపట్టిందని రీసర్వే నిర్వహించకుంటే బీసీల పక్షాన ఉద్యమం చేస్తామని రామగుండం మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హెచ్చరించారు. ఈ నెల 14న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీలు హాజరుకావాలని ఆయన పిలుపు నిచ్చారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ కులగణన సర్వే అంతా తప్పుల తడకని, కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసానికి కేరాఫ్ అడ్రస్ అని అన్నారు. సర్వేల పేరుతో బీసీల జనాభా శాతాన్ని తగ్గించి ఓసీల జనాభాను పెంచారన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సకలజనుల కుటుంబ సర్వేకు ప్రస్తుతం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను ఆ పార్టీకి సంబంధించిన నేతలే తప్పుపడుతున్నారని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్పు రావడంలేదని విమర్శించారు. బీసీ కులాలు ఐక్యం కావలసిన అవసరం ఉందన్నారు. ఈ నెల 14న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఉదయం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఈ సమావేశానికి బీసీ ఉప కులాలు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కుల గణన సర్వేలో ఐదున్నర శాతం బీసీ జనాభా తగ్గించి దాదాపు 22లక్షల మంది లేనట్టుగా చేసింది రేవంత్ సర్కార్ అన్నారు. బీఆర్ ఎస్ పార్టీ మాత్రమే బీసీలకు పార్లమెం టు, అసెంబ్లీ ఎన్నికల్లో 50శాతం సీట్లు కేటాయిం చిందని గుర్తు చేశారు. అసెంబ్లీ 34, పార్లమెం టులో ఆరు సీట్లు కేటాయించిందన్నారు. కాంగ్రెస్ చేపట్టిన కులగణన పూర్తిగా బీసీలకు అన్యాయం జరిగేలా ఉందన్నారు. సమావే శంలో నాయకులు గోపు ఐలయ్య యాదవ్, బొడ్డు రవీందర్, బోడ్డుపల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, అచ్చ వేణు, కల్వచర్ల కృష్ణవేణి, సట్టు శ్రీనివాస్, అల్లం ఐలయ్య, సంధ్యారెడ్డి, కోడి రామకృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై శిక్షణ

పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆర్ఓలు, ఏఆర్ఓలకు సంబంధిత అధికారులు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 266 గ్రామ పంచాయతీల్లో స్టేజీ 1లో 109 మంది ఆర్ఓలు, 109 మంది ఏఆర్ఓలు, స్టేజీ 2లో 315 మంది ఆర్ఓలకు శిక్షణ ఇచ్చారు. అలాగే 13 జిల్లా పరిషత్‌లు, 140 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నియమించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, తుది జాబితా ప్రకారం అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ఎన్నికల నియమావళిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఆరంభించిన జిల్లా అదనపు కలెక్టర్ డి వేణు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, జడ్పీ సీఈఓ నరేందర్, డీఆర్‌డీఓ కాళిందిని, డీఈఓ మాధవి పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో ఉచిత ధ్యాన శిక్షణ

కమాన్‌పూర్, ఫిబ్రవరి12,(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో ఈ నెల 14,15,16వ తేదీలలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రవీందర్‌రెడ్డి, రాజనందచారి, సరోజులు తెలిపారు. 15సంవత్సరాలు దాటిన వారందరూ పాల్గొనవచ్చునని తెలిపారు. సాయంత్రం 6గంటల నుంచి 7.30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తల్లీకూతురును హత్య చేసిన కేసులో నిందితుడు కొక్కిస వెంకటేశ్ (55)కు జీవిత ఖైదుతోపాటు 2,500 రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండెపల్లికి చెందిన కొక్కిస వెంకటేశ్ అలియాస్ వెంకన్న బతుకుదెరువుకోసం హుజూరాబాద్‌కు వచ్చి జీవిస్తున్నాడు. అతడి మొదటి భార్య ముప్పై ఏళ్ల క్రితం విడాకులు తీసుకొని వెళ్లిపోయింది. అనంతరం కూతురు ఉన్న రమను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆటో నడుపుకుంటూ స్థానికప్రతాపవాడలో నివాసముంటున్నాడు. తరచూ భార్య, కూతురుతో ఆర్థిక విషయాల్లో గొడవలు జరుగుతుండేవి. దీంతోపాటు వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానం పెంచుకున్నాడు. 21జనవరి 2021న రాత్రి భార్య రమ, కూతురు ఆమని (24) నిద్రిస్తుండగా ఇనుపపైపుతో తలలపై తీవ్రంగా గాయపరిచి చంపాడు. హుజూరాబాద్ పోలీసులు వెంకటేశ్‌పై కేసు నమోదు చేయగా ఏసీపీ కె.వెంకట్‌రెడ్డి దర్యాప్తు చేపట్టారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరి శ్రీరాములు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి విచారించారు.

హత్యాయత్నం కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

పెద్దపల్లి రూరల్,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలితం గ్రామ పంచాయతీ పరిధిలోని పుట్టపల్లిలో 2016లో జరిగిన హత్యాయత్నంలో భర్త సిద్ధం చంద్రమౌళికి ఏడు సంవత్సరాల జైలు శిక్షను ఖరారు చేస్తూ పెద్దపల్లి అసిస్టెంట్ సెషన్ జడ్జి శ్రీనివాసులు బుధవారం తీర్పునిచ్చారు. 2016లో పుట్టపల్లికి చెందిన సిద్ధం చంద్రమౌళి ఓ తగాదా విషయంలో భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి పెద్దపల్లి ఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేయగా 8 ఏళ్ల అనంతరం కోర్టులో విచారణ కొనసాగింది. ఎస్ఐ లక్ష్మణ్‌రావు సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. ఈమేరకు పెద్దపల్లి సెషన్స్ జడ్జి శ్రీనివాసులు నిందితునికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

దుప్పి మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ అడ్డగుట్ట ప్రాంతంలో దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం ఫారెస్ట్ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. కోనరావుపేట మండలానికి చెందిన కొమురయ్య అనే వ్యక్తి ముస్తఫానగర్ గ్రామ సమీపంలో మాంసాన్ని అమ్ముతుండగా ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. సిరిసిల్ల ఫారెస్ట్ రేంజ్ డిప్యూటీ అధికారి అంజలి ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కొనరావుపేట మండలానికి చెందిన గంట కొమురయ్య అనే వ్యక్తి దుప్పిని వేటాడి హతమార్చాడని వెల్లడించారు. దుప్పి మాంసాన్ని ముక్కలుగా చేసి ప్యాకెట్లలో కిలో చొప్పున అమ్ముతున్నట్టు అందిన పక్కాసమాచారం మేరకు ఆప్రాంతానికి వెళ్లి గాలించామన్నారు. అడ్డగుట్ట ప్రాంతంలోని ఓ చెట్టు కింద దుప్పి మాంసాన్ని కొమురయ్య విక్రయిస్తున్నట్టు గమనించి సిబ్బంది చాకచక్యంగా వెళ్లి పట్టుకున్నారని పేర్కొన్నారు. దాదాపు 33కేజీల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడైన కొమురయ్యపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. వారి వెంట బీట్ ఆఫీసర్లు రమేష్, జ్యోతి తదితరులు ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం.. కేసు నమోదు



కట్ల పర్శయ్య (ఫైల్)

కోనరావుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పింఛన్ డబ్బులు తీసుకొని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామానికి చెందిన కట్ల పర్శయ్య(68) సోమవారం పింఛన్ డబ్బులు తీసుకొని వస్తానని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం ప్రయత్నించగా సిరిసిల్ల బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరా ఫుటేజ్ ప్రకారం కామారెడ్డి బస్సు ఎక్కి వెళ్లినట్లు గుర్తించారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వ్యక్తులు కోనరావుపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ప్రసాద్ రెడ్డి కోరారు.

కాలు జారిపడి ఒకరి మృతి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో ఓవ్యక్తి స్నానాలగదిలో కాలుజారి పడిపోవడంతో గాయపడి మృతిచెందాడు. పట్టణానికి చెందిన మల్లేశం (58) బుధవారం స్నానంచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే అతన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

గ్రామాల వివరాలు 'మేరీ పంచాయత్'లో..



చొప్పదండి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏదైనా పనుల వివరాలు కావాలని అడిగితే చెప్పేవారు ఉండరు. ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానం చెప్పే వారు ఉండరు. విసుగు చెంది వివరాల కోసం సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవాల్సిన పరిస్థితి ప్రజలకు ఉండేది. ఇప్పుడు అలాంటి సమస్య లేకుండా కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయత్ యాప్ ప్రవేశపెట్టింది. గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఇతర వివరాలు ప్రజలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం యాప్ ను రూపొందించింది. పంచాయతీల ఆదాయ, వ్యయం విషయాల్లో పారదర్శకత పాటించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల వివరాలను పంచాయతీ కార్యాలయానికి వెళ్లకుండానే ప్రజలు ఈ యాప్‌లో పరిశీలించవచ్చు. ఈ యాప్‌ను 2019 లో కేంద్ర ప్రభుత్వం రూపొందించగా సాంకేతిక కారణాలతో పూర్తిస్థాయిలో అందుబాటులకు తీసుకురాలేకపోయింది. ప్రస్తుతం ఈ యాప్ పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

● గ్రామాల వివరాలన్నీ అందుబాటులో..



గ్రామ పంచాయతీల్లో విధుల వివరాలతోపాటు, కార్యదర్శి, గ్రామ కమిటీలు ఆస్తుల వివరాలు, జనాభా వివరాలు యాప్‌లో అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి యేటా పంచాయతీలకు మంజూరు చేసే నిధుల వివరాలు, పనులకు చేసిన ఖర్చు, పనులు ఏ దశలో ఉన్నాయో అనే వివరాలు యాప్‌లో నమోదై ఉంటాయి. పంచాయతీలకు మంజూరైన నిధులు కార్మికులు, సిబ్బంది వేతనాలు ఇతర ఖర్చులు యాప్‌లో పొందుపరిచారు. స్టేట్ ఫైనాన్స్, సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ నిధుల వివరాలు కూడా యాప్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

- పథకాలు, సేవల వివరాలకు ప్రత్యేక యాప్
- నిధులు, ఖర్చుల పారదర్శకతకు ప్రాధాన్యం

● పనులు, నిధుల వివరాలు

పారదర్శక పాలనకు గ్రామ పంచాయతీల్లో వివిధ పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటారు. నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయడంతో గ్రామాల్లో పారదర్శక పాలన సాగుతుందని పాలకులు భావిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఎన్ని మంజూరయ్యాయో, పనులు ఏ మేరకు పూర్తయ్యాయి, వాటి చెల్లింపులు ఎంత జరిగాయి అనేది ప్రజలు యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. గ్రామాలకు ప్రభుత్వాలు ఎలాంటి పనులను మంజూరు చేస్తుందో ఎంత ఖర్చు చేసిందో ప్రజలు తెలుసుకోవచ్చు. పనులను చేసే సమయంలో జీపీఆర్ఎస్ ద్వారా పనిని గుర్తించే అవకాశం ఉంటుంది. పనులకు కేటాయించిన డబ్బులను ఇతర గ్రామాలకు వినియోగించేందుకు వీలు లేకుండా ఉంటుంది. పాలకవర్గాలు ఏలాంటి పొరపాట్లు చేయకుండా ఉంటుంది. ప్రజాప్రతి నిధులు, అధికారులు తప్పుడు నివేదికలను రూపొందించే అవకాశం లేకుండా ప్రజలు ప్రశ్నించే వీలు యాప్ ద్వారా కలుగుతుంది. నిధుల దుర్వినియోగం జరుగకుండా, ఎంత మంజూరు అయ్యాయి ఎంత ఖర్చు చేశారనేది కూడా యాప్ ద్వారా ప్రజలు తెలుసుకోవచ్చు.

● యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా

స్మార్ట్ ఫోన్‌లో ఉండే ప్లేస్టోర్ యాప్ లోకి వెళ్లి మేరీ పంచాయత్ పేరుతో వచ్చే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. లాగిన్ కాగానే రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలి. గ్రామాన్ని ఎంపిక చేసుకున్న తర్వాత పంచాయతీకి సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. జనాభా, ఆదాయ వ్యయాలు, చేపట్టిన పనులు, నిధులు తదితరాంశాలు అందులో అందుబాటులో ఉంటాయి. గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రతి కమిటీ వివరాలు, పనుల వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

యజమాని ఇంట్లో కేర్ టేకర్ చోరీ

● నిందితుడి రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ వెంకటస్వామి

కరీంనగర్‌క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యజమాని ఇంట్లో కేర్‌టేకర్ చోరీకి పాల్పడగా పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్‌టౌన్ ఏసీపీ వెంకటస్వామి బుధవారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ సాయినగర్‌కు చెందిన రవికంటి అఖిల్ టవర్‌సర్కిల్‌లో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈనెల 9న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల తిరుపతి దైవదర్శనానికి వెళ్లాడు. బుధవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటికి తాళం వేసి ఉన్నా వెనకవైపున కిటికీ పగులగొట్టి ఉంది. అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 98 గ్రాముల బంగారం కనిపించలేదు. బాధితుడు రెండో టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తనఇంట్లో పని చేస్తున్న కేర్‌టేకర్‌పై అనుమానం ఉన్నట్లు పేర్కొన్నాడు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అఖిల్ తండ్రి మనోహర్ ఆరోగ్యం బాగా లేకపోవడంతో గన్నెవల్లికి చెందిన బెజ్జంకి సంతోష్‌ను నాలుగు నెలల క్రితం కేర్‌టేకర్ నియమించుకున్నాడు. కుటుంబ సభ్యులులేని సమయంలో సంతోష్ ఇల్లంతా తిరుగుతుండేవాడు. ఇంటి వెనుకవైపు కిటికీకి గ్రిల్‌లేదనే విషయం గమనించాడు. అవకాశం కోసం చూసిన సంతోష్ యజమాని తిరుపతికి వెళ్లడంతో బీరువా తాళాలను పగులగొట్టి లాకర్‌లో ఉన్న 98 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లాడు. అందులో కొంత విక్రయించి జల్సాలకు ఖర్చు చేశాడు. మిగతా బంగారం అమ్ముకునేందుకు కరీంనగర్‌లోని ఐబీచౌరస్తా వద్ద ఉండగా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 7.45 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న రెండోటౌన్ సీఐ కె సృజన్‌రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్, కానిస్టేబుల్ రాజునాయక్, రాంకుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య



రాధవ్వ (ఫైల్)

పెగడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల గ్రామానికిచెందిన దాసరి రాధవ్వ(85) వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలు భరించలేక వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాధవ్వ మంగళవారం రాత్రి తిని పడుకుందని, బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు లేచేసరికి ఇంట్లో లేకపోవడంతో చుట్టుపక్కల గాలిస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ బావిలోపడి మృతిచెందిందన్నారు. మృతురాలి కుమారుడు రాయమల్లు ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రవీందర్ కేసు నమోదు చేశారు.

చందాల కోసం వచ్చి వృద్ధురాలి బంగారం చోరీ



ఊట్‌పల్లిలో సీసీ ఫుటేజీలో రికార్డ్ అయిన యువతులు

కథలాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): కథలాపూర్ మండలం ఊట్‌పల్లిలో అనాథాశ్రమం కోసం చందాలు వసూలు చేస్తున్నామని నమ్మించిన ఇద్దరు యువతులు బుధవారం గజ్జెల్లి భూదవ్వ(70) అనే వృద్ధు రాలి మెడలోంచి ఏడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల కథనం ప్రకారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో గ్రామంలోకి ప్రవేశించిన యువతులు పలువురి ఇళ్లకు వెళ్లి చందాలు వసూలు చేశారు. అయితే ఎవరికీ రసీదు ఇవ్వలేదు. గజ్జెల్లి భూదవ్వ ఇంటికివెళ్లి చందారాయాలని అడిగి లోనికి చొరబడ్డారు. నోట్లో గుడ్డలు కుక్కి మెడపై ఉన్న ఏడుతులాల బంగారం ఎత్తుకెళ్లారు. బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు ఇంటి బయట గొళ్ళెంవేసి పారిపోయినట్టు బాధితురాలు తెలిపింది. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి విచారణ జరిపారు. గ్రామంలోని పలు సీసీ కెమెరాల్లో రికార్డైన ఫుటేజీనిపోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా బంగారం ఎత్తుకెళ్లిన యువతులు కోరుట్ల పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

రూ.3 వేల విలువైన మద్యం స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. విక్రయించేందుకు నిల్వ చేసిన రూ.3 వేల విలువైన మద్యం స్వాధీనపర్చుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మద్యం అమ్మకాలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో మద్యం విక్రయాలపై తమకు సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు.

రైలు ఢీకొని మృతి చెందిన వృద్ధుడి గుర్తింపు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని సాంబయ్యపల్లి గ్రామ పరిధిలో రైలు ఢీకొని మృతి చెందిన వృద్ధుడిని గుర్తించినట్టు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న సోమవారం కరీంనగర్- సుల్తానాబాద్ రైల్వేలైన్‌పై సాంబయ్యపల్లి వద్ద పట్టాలు దాటుతున్న వృద్ధుడిని కరీం నగర్ తిరుపతి వెళ్లే రైలు ఢీకొంది. వృద్ధుడి వివరాలు తెలియరాలేదు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులు గుర్తించి తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. కరీంనగర్ ఇరుకుల్ల గ్రామానికి చెందిన ఎగుర్ల లింగయ్య(74)గా గుర్తించామన్నారు. ఇతను మానకొండూరు మండలం లక్ష్మీపురం గ్రామంలోని తన అక్క రాజమ్మను చూడడానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

● ఇద్దరి మృతితో పోతిరెడ్డిపేటలో విషాదం



జూపాక శ్రీహరి(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్నేహితులిద్దరూ కలిసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లగా, మృత్యువు వారిని కాలువ రూపంలో కబళించింది. ఈ సంఘటన పోతిరెడ్డిపేట గ్రామంలో విషాదం నింపింది. గ్రామస్థులు, కుటుం బసభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. జూపాక శ్రీహరి(45),రేణిగుంట సురేష్(30) మంగళవారం గ్రామశివారులోని ఉప కాలువలో ఈతకొట్టేందుకు వెళ్లారు. మొదట జూపాకశ్రీహరి కాలువలోకి దిగగా నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకొని పోయాడు. గమనించిన సురేష్ వెంటనే కాపాడే ప్రయత్నంలో నీటిలోకి దిగగా అతనుసైతం నీటిప్రవాహానికి కొట్టుకొనిపోయాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొంతమంది గ్రామయువకులు సురేష్ మృతదేహాన్ని వెలికితీయగా, జూపాక శ్రీహరి మృతదేహం ఆచూకీలభ్యం కాలేదు. బుధవారం గ్రామశివారులో కాలువ వద్ద జూపాక శ్రీహరి మృతదేహం లభ్యమైంది. స్నేహితులిద్దరి మృత దేహాలను చూస్తూ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): మెట్‌పల్లిపట్టణంలోని బోయవాడకు చెందిన ఎల్ల అన్వేష్(35)అనే వ్యక్తి కొంత కాలంగా మానసికస్థితి సరిగా లేక బుధవారం తల్లిదండ్రులపై కత్తితో దాడి చేసినట్టు మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. అన్వేష్ తల్లి ఎల్లరమాదేవిపై దాడిచేయగా మెడ, చేతిభాగంలో గాయాలుకాగా తండ్రిగంగనర్సయ్యకు ఎడమ చేతివేలు భాగాలలో తీవ్రంగా గాయలైనట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి గంగ నర్సయ్య ఫిర్యాదు మేరకు మెంటల్‌యాక్ట్, హత్యా యత్నం సెక్షన్లలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటోలో 5క్వింటాళ్ల బియ్యం లభించాయన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటో డ్రైవర్, ఓనర్ గంట గణేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న మహిళ అరెస్టు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న గంట సమ్మవ్వను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. కొనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన సమ్మవ్వ బుధవారం నిబంధనలకు విరుద్ధంగా పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుండగా పట్టుకొని ఆమె వద్ద ఉన్న 1.5 క్వింటాళ్ళ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గొర్రెగుండం అటవీ ప్రాంతంలో కలవరం

● పులి సంచారం వదంతులతో గ్రామస్థుల్లో భయాందోళన

మల్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం గొర్రెగుండం అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు వదంతులు రావడం స్థానికులను కలవరానికి గురి చేస్తోంది. కొడిమ్యాల మండలం శనివారంపేట నుంచి గొర్రెగుండం వచ్చే మార్గంలో మంగళవారం మనుబోతును పులి చంపి తిన్నట్లు వచ్చిన వదంతులతో ఈప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీఅధికారులు మంగళవారం రాత్రి గ్రామంలో దప్పుచాటింపు చేయించారు. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. మనుబోతు మృతదేహం గల ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ విషయమై కొడిమ్యాల ఫారెస్ట్ రెంజర్ మొయినుద్దీన్‌ను సంప్రదించగా మనుబోతును చంపి తిన్నది పులి కాదని పులి అయితే తలపై దాడి చేస్తుందని అయితే మనుబోతు వెనక వైపు గాయాలు కనిపించాయని తెలిపారు. మనోబోతు వ్యాధితో మృతి చెందితే కుక్కలు పీక్కుతున్నట్లు అనిపిస్తోందన్నారు. సీసీ కెమెరాలను పరిశీలించగా పులి సంచారం, చంపినట్లు ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో నెమలి మృతి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండ లంలోని రామకృష్ణకాలనీలోని ఉపగ్న హోమ్స్ వద్ద బుధవారం సాయంత్రం ఓ నెమలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. నెమలి పైకి ఎగిరే క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రోడ్డు వెళ్తున్న గ్రామస్థులు గమనించి వెంటనే అటవీ శాఖాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

ఇల్లు విక్రయం పేరిట రూ.16.35 లక్షలు స్వాహా

● నకిలీ న్యాయవాదితో పాటు ముగ్గురి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని జేపీనగర్‌కు చెందిన మచ్చ నారాయణకు తన కొడుకు డైవర్స్ కేసు కోర్టులో ఫైల్‌చేస్తానని నమ్మించిన నకిలీ న్యాయవాది అయిన ఏనుగు ఫణీందర్‌తో పాటు అతని భార్య ఆడెపు రజిత, మరో వ్యక్తి బొల్లి మార్కండేయలను అరెస్టుచేసినట్లు టౌన్ సీఐకృష్ణ తెలిపారు. సిరిసిల్లపట్టణం ఆటోనగర్‌కు చెందిన ఏనుగు ఫణీందర్ అనే నకిలీ న్యాయవాది మచ్చనారాయణ, అతని కుమారుడి విడాకుల కేసు వేస్తానని దగ్గరై ఇల్లు కొనుగోలు చేసినట్లు సంతకాలు తీసుకుని మోసం చేసాడన్నారు. ఇల్లు ఖాళీ చేయాలని బాధితులను వేధించడంతో బలవంతంగా నారాయణ వద్ద నుంచి 16.35 లక్షలు వసూలు చేశాడని సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి ముగ్గురుని అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. ఫణీందర్ బాధితులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

చొప్పదండి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని కరీంనగర్‌రూరల్ ఎక్సైజ్ ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో మత్తుపదార్థాలతో కలిగే దుష్ప్రభావాలపైన నిర్వహించిన అవగాహనసదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వలన విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు, ఎక్సైజ్‌సిబ్బంది పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించరూ..

● బస్సు కోసం రోడ్డు పైనే పడిగాపులు ● గన్నేరువరం మండల కేంద్రంలో ప్రయాణికుల కష్టాలు



మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఓ షాపు మెట్ల పైన కూర్చొని బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గన్నేరువరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పారువెల్ల, యాస్వాడ, చొక్కారావుపల్లి, మైలారం గ్రామాలకు వెళ్లే నాలుగు రోడ్ల ప్రధానకూడలివద్ద బస్సుషెల్టర్ కరువైంది. దీంతో ప్రయాణికులు ఎండైనా, వానయినా రోడ్డు పక్కన ఉన్న పలుదుకాణాలను ఆశ్రయిస్తున్నారు. బస్సులకోసం గంటల తరబడి వేచిఉండే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో నిత్యంవందలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు వారిబాధ వర్ణనాతీతం. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తమసామగ్రితో వేచి ఉండడానికి స్థలంలేక రోడ్డుపక్కన ఉన్న పలు దుకాణాల మెట్లపైన పెడుతూ నానాఅవస్థలు పడుతున్నారు. దుకాణాలు, హోటల్‌లవద్ద వేచి ఉంటే యజమానులు పక్కకువెళ్లాలని చెబుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగురోడ్ల ప్రధానకూడలి వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో..
ఎస్ఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



జేఈఈ మెయిన్ పరీక్షల్లో సత్తా చాటిన ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో జోనల్ ఇన్‌ఛార్జి తిరుపతి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ 2025 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని విద్యాసంస్థల జోనల్ ఇన్‌ఛార్జి నేదూరి తిరుపతి అన్నారు. అల్గునూర్‌లో ఎస్సార్ జూనియర్ కళాశాలలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థకు చెందిన 150మంది విద్యార్థులు జాతీయస్థాయిలో మంచి పర్సంటైల్ సాధించారన్నారు. మెయిన్స్‌లో కొల్లూరి హాసిని, గోవిందారపు శివసాయి, ముదిగంటి రుశిశ్వర్‌రెడ్డి, దయ్యాల రాజ్‌కుమార్, పోగుల ఆశ్రిత, జవాజ సహస్ర, దొనకొండ సాయి, మేకల సంజన, చరణ్‌జోషి, కటకం శ్రీలేఖ 90 శాతానికిపైగా పర్సంటైల్ సాధించారన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్స్ అశోక్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ నాగర్జునరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మారుతి, నరోత్తమ్‌రెడ్డి, హిహెచ్‌ప్రవీణ్‌రెడ్డి, ఏవో లక్ష్మీప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్నకు
యూఎస్ఏ భక్తురాలు మొక్కులు



భర్తతో కలిసి రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న యూఎస్ఏ భక్తురాలు పీటర్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి యూఎస్ఏకు చెందిన పీటర్ అనే భక్తురాలు మొక్కులు చెల్లించుకుంది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన వీరభద్రరావు అనేవ్యక్తిని వివాహం చేసుకుంది. ఈ సందర్భంగా శ్రీస్వామివారిని బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి పీటర్ దర్శించుకుని కోడెమొక్కు చెల్లించుకుంది. తాము కుటుంబసభ్యులతో కలిసి యూఎస్ఏలోని సెటిల్ అయినట్లు తెలిపారు. తమ ఇంటి ఇలవేల్పు కావడంతోనే రాజన్న ఆలయానికి వచ్చినట్లు వీరభద్రరావు పేర్కొన్నారు.

అంజన్న భక్తుల గిరి ప్రదక్షిణ

మల్యాల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు అంజనేయస్వామి గిరులచుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణ బుధవారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధానర్చకుడు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో 25వసారి నిర్వహించిన ఈ గిరిప్రదిక్షణ నూతన మార్గంలో సాగింది. కొండగట్టు గుట్టచుట్టూ ప్రదక్షిణ కోసం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇటీవల రూ.3లక్షలు సొంతంగా అందించగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో మార్గం ఇటీవల పూర్తి అయింది. దీంతో బుధవారం ఈ మార్గంలో వందలాది మంది భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు. అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న భక్తులు



ఇది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ

నైపుణ్యాల అభివృద్ధి..
భవితకు మార్గదర్శి

- డిగ్రీ విద్యార్థులకు వరంగా మారిన టీఎస్‌కేసీ
- ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్ ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని పేద విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు వారి భవితకు మార్గదర్శిగా నిలుస్తోంది తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ). గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పేద విద్యార్థులకు టీఎస్‌కేసీ వరంగా మారింది. సమైక్యాంధ్ర రాష్ట్రంలో 2005లో జవహర్‌లాల్ నాలెడ్జ్ సెంటర్‌గా ప్రారంభమైనప్పటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014 నుంచి టీఎస్‌కేసీగా మారింది. విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించి వారికి కావాల్సిన మెటీరియల్ అందిస్తూ కొలువులు పొందే విధంగా టీఎస్‌కేసీ కృషి చేస్తోంది. డిగ్రీలోని బీకాం(జనరల్), బీకాం కంప్యూటర్స్, బీఏ, బీఎస్‌సీ తదితర గ్రూపుల్లోని విద్యార్థులకు రెగ్యులర్ క్లాసులతోపాటు మూడు నెలల పాటు అన్ని గ్రూపుల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నది.

● ప్రభుత్వ కళాశాలకే కంపెనీలు

సాధారణంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. డిగ్రీ విద్యార్థులకు ఆ అవకాశం లేదు. దీంతో ప్రభుత్వం టీఎస్‌కేసీ ద్వారా అవకాశం కల్పిస్తోంది. డిగ్రీ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చి పలు కంపెనీలు జాబ్‌మేళాలు నిర్వహించేలా చూస్తోంది. ఇప్పటి వరకు ఐటీ, నాన్‌ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా కంపెనీలలో విద్యార్థులు డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగం సాధించారు



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులు

● అనుభవజ్ఞులతో శిక్షణ

టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్ డెవలప్‌మెంట్‌తోపాటు, రీజనింగ్ అండ్ యాటిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్, సామాజిక అంశాలపై అవగాహన, కరెంట్ ఎఫైర్స్, కంప్యూటర్ స్కిల్స్‌పై అనుభవజ్ఞులతో శిక్షణ ఇస్తారు. స్టేజ్ ఫియర్ ఎదుర్కోవడం, ఇంటర్వ్యూల భయం పోగొట్టేందుకు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. హైదరాబాద్, బెంగళూర్, పూణే ప్రాంతాల నుంచి ట్రైనర్స్‌ను తీసుకువచ్చి శిక్షణ ఇస్తున్నారు.

● టాస్క్‌తో మరో అడుగు...

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్(టాస్క్)తో డిగ్రీ విద్యార్థుల భవితకు మరో అడుగు ముందుకు వేసింది. హైదరాబాద్, బెంగళూర్ వంటి ప్రాంతాలకు వెళ్లి రూ. 30 వేల నుంచి రూ. 50 వేల వరకు పెట్టి చదివే స్తోమత లేని రూరల్ ఏరియా డిగ్రీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు టాస్క్ ఉచితంగా పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నది. మొదట విద్యార్థులు టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కళాశాలలో ప్రత్యేకంగా ట్రైనర్ శిక్షణ ఇస్తారు. బీటెక్ చదివిన వారితో సమానంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నది. పోటీ పరీక్షలకు సంబంధించిన వివరాలను తెలియజేయడంతో పాటు వాటికి సంబంధించిన మెటీరియల్స్‌ను ఇస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నది.

విద్యార్థులకు ప్రయోజనం

- డాక్టర్ జైకిషన్ ఓజా, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖని



టీఎస్‌కేసీ, టాస్క్‌తో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. రెగ్యూలర్ సిలబస్‌తోపాటు టీఎస్‌కేసీ ద్వారా ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి ట్రైనర్స్ వచ్చి ప్రైవేట్ కంపెనీలలో ఏవిధంగా ఇంటర్వ్యూలను ఎదుర్కొవాలి, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై థియరీ తరగతులతోపాటు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించి జాబ్‌మేళాలను నిర్వహిస్తుంది.

● పేద విద్యార్థుల ఉపాధి కల్పనకు

- డాక్టర్ జి సుబ్బారావు, కోఆర్డినేటర్, టీఎస్‌కేసీ, టాస్క్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, గోదావరిఖని



పేద విద్యార్థులకు ఉద్యోగాల కల్పించేందుకు వారికి కావాల్సిన కమ్యూనికేషన్స్ స్కిల్ తదితర అంశాలపై టీఎస్‌కేసీ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ బాధ్యతను నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నా. శిక్షణ ఇవ్వడం, ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించే క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, టీఎస్‌కేసీ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు.

టీఎస్‌కేసీ కెరియర్‌కు ఎంతో దోహదపడింది.

- రుక్షిత, ఎన్‌టీపీసీ



2021లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, 2023లో కాకతీయ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశాను. టీఎస్‌కేసీ ద్వారా తీసుకున్న శిక్షణ నా కెరియర్‌కు ఎంతో దోహదపడింది. ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో లాబోరేటరీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాను. టాస్క్ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్, అర్థమెటిక్స్ చాలా ఉపయోగపడ్డాయి.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా చేస్తున్నా...

- జక్కుల ప్రేమ్‌సాయి, గోదావరిఖని



గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2017-2020లో బీఎస్‌సీ ఎంపీసీఎస్ పూర్తి చేశాను. టీఎస్‌కేసీ ద్వారా తీసుకున్న శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడింది. ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఛత్తీస్‌గడ్ దంతేవాడలో పనిచేస్తున్నా. టీఎస్‌కేసీ నా కెరియర్ అభివృద్ధికి చాలా ఉపయోగపడింది.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి): వేములవాడలో ఈనెల 25వ తేది నుంచి 27వ వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, గత సంవత్సరం మహాశివరాత్రి జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తిన సమస్యలను పరిష్కరించుకుని ముందుకు సాగుతామని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయపరిసరాల్లో నిర్వహించే కోడె క్యూలైన్, ఉచితటిఫిన్, భోజనం, లడ్డూ కౌంటర్, సులబ్ కాంప్లెక్స్, పార్కింగ్ ఏరియా, చలువ పందిళ్ల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈనెల 25,26,27వ తేదిల్లో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో రానున్నారని తెలిపారు. సుమారు నాలుగు లక్షల మంది వరకు భక్తులు రానున్నారని అన్నారు. రాజన్న ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని అన్నారు. గతంలో జరిగిన ఇబ్బందులు ఏమైనాఉంటే వాటినిసరి దిద్దుకుని ముందుకుసాగాలని సూచించారు. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలనుఅందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. భక్తులు శ్రీస్వామివారిని దర్శించుకునే సమయంలో క్యూలైన్‌లోఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుం టున్నామన్నారు. మహాశివరాత్రిని వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులసమన్వయంతో ముందుకువెళుతున్నామని తెలిపారు. ఆయనవెంట ఈఈ రాజేష్, డీఈ రఘునందర్, ఏఈవోశ్రావణ్ పర్యవేక్షకులు వరినర్సయ్య, సంజీవరావు తదితరులు ఉన్నారు.



క్యూలైన్‌లను పరిశీలిస్తున్న రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ నిల్

- నేటితో ముగియనున్న గడువు

కరీంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగియనుందని, బుధవారం అభ్యర్థులెవరూ ఉపసంహరించుకోలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని, పరిశీలనలో 32 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని, 68మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 17మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరినామినేషన్ తిరస్కరణకు గురైందని, 16మంది నామినేషన్లు సరిగా ఉన్నట్లు ప్రకటించామని పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం మధ్యాహ్నం 3గంటలకు ముగియనున్నట్లు వెల్లడించారు.

- మల్కపేట జలాశయం నుంచి సాగు నీటి విడుదలకు సన్నాహాలు
- 9వ ప్యాకేజీ కాల్వ పనులు ముమ్మరం
- అన్నదాతల్లో ఆనందం



కాల్వలోని ముళ్లపొదలను తొలగిస్తున్న ట్రాక్టర్

మెట్ట ప్రాంతానికి
గోదావరి జలాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రెండుమూడు రోజుల్లో మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు చేరుకోనున్నాయి. ఇందుకోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి ఎగువ మానేరు జలాశయం వరకు చేపట్టిన తొమ్మిదవ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని అందించి పంటలు ఎండిపోకుండా చూడాలని ఇటీవల రైతులు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూలకు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన సర్కారు మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. నీటి పారుదల శాఖ అధికారులు కాల్వల్లోని ముళ్ల పొదలు, మరమ్మతు పనులను ముమ్మరం చేశారు. రెండు రోజుల్లో పనులు పూర్తిచేసి మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు అందించేలా సన్నాహాలు చేస్తున్నారు. సాగునీరు విడుదల చేస్తారనే సమాచారంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

● యుద్ధ ప్రాతిపదికన పనులు

గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నీటి వనరులన్నీ నిండాయి. దాంతో సుమారు 16850 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి పంటలను సాగుచేశారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎండలు ముదరడంతో నీటి వనరుల్లో నీరు తగ్గిపోయింది. బోరుబావులు సైతం ఏకధాటిగా నీరు పోయకపోవడం వల్ల మండలంలోని బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా, రాచర్లగొల్లపల్లి, తిమ్మాపూర్, అక్కపల్లి తదితర గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలు పగుళ్ల బారుతున్నారు. కళ్ల ముందే 400 ఎకరాల విస్తీర్ణంలోని పొలాలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని అందించి పంటలను రక్షించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ నాయకులు, రైతులు ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్కారు మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు పనులను ముమ్మరం చేశారు. సుమారు 18.3 కిలోమీటర్ల పొడవు ఉన్న కాలువలో ముళ్లపొదలు, చెత్తాచెదారం తొలగిస్తున్నారు. రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పంటలు ఎండిపోకుండా చూడాలి..

- ప్రభునాయక్, రైతు, కిష్టునాయక్‌తండా



నాకున్న మూడు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. బోరు బావుల్లో నీరు అడుగంటడం వల్ల పొలానికి నీరు అందడం లేదు. ఎకరం పొలం పగుళ్ల చూపింది. 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంటలు ఎండిపోకుండా చూడాలి.

సాగు నీటిని అందించాలని విన్నవించాం..

- దొమ్మాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన వరి పొలాలు పగుళ్ల చూపుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన వారు ప్రభుత్వానికి నివేదించారు. మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటి అందించి పొలాలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

నీటి విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నాం

- కిషోర్, ఈఈ, 9వ ప్యాకేజీ

మల్కపేట జలాశయం నుంచి ఎగువ మానేరు జలాశయం వరకు 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీరును అందించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మల్కపేట జలాశయంలో 1 టీఎంసీ నీరు నిల్వ ఉంది. ఎగువ మానేరు జలాశయం వరకు నీటిని విడుదల చేయాలంటే శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి మరో 0.5 టీఎంసీ నీరు అవసరం ఉంటుంది. అందుకు ప్రభుత్వ అనుమతి తీసుకునేలా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. 9వ ప్యాకేజీ కాల్వను శుభ్రంచేయడంతో పాటు మట్టిని తొలగించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నాం.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సుకు
ప్రధానోపాధ్యాయుడి ఎంపిక



అభయ్‌రాజ్

రాయికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి సైన్స్‌సదస్సుకు మండలంలోని కుమ్మరిపెల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్‌రాజ్ ఎంపికైనట్లు జిల్లాసైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ తెలిపారు. "మనచుట్టూ ఉన్న ప్రపంచంలో విజ్ఞానశాస్త్రం" అనేఅంశంపై రాష్ట్రవ్యాప్తంగా పరిశోధనాపత్రాలు ఆహ్వానించగా జగిత్యాల జిల్లా నుంచి అభయ్‌రాజ్ రూపొందించిన పరిశోధనాపత్రం ఎంపికైంది. ఈనెల 28న రాష్ట్ర విద్యాశిక్షణా పరిశోధనాసంస్థలో రూపొందించిన "ప్రయోగశాలగా వంటశాల" పరిశోధనా పత్రం ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా అభయ్ రాజ్‌ను జిల్లా విద్యాధికారి కె.రాము, మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేష్ మండల అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య తదితరులు అభినందించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జగిత్యాలరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం అంబారిపేట, తాటిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం తదితర వైదికక్రతువులు నిర్వహించారు. జగిత్యాలమండలం అంబారిపేట గ్రామంలోని శ్రీవెంకటేశ్వర ఆలయంనందు మొదటిసారిగా గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్వామివారి నామస్మరణతో ఆలయమంతా మారుమ్రోగింది.

సమరానికి సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, ముస్లింలు, ఇతరుల వివరాలను ప్రభుత్వం విడుదల చేసింది. అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం కూడా పొందారు. అయితే ఈ సర్వేపై విమర్శలు వస్తున్నప్పటికీ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్లు వస్తున్నాయి. మరో వైపు.. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై విధించిన డెడ్ కమిషన్ తన నివేదికను మంగళవారం ప్రభుత్వానికి సమర్పించింది. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఆయా వర్గాల నుంచి విజ్ఞప్తులు వచ్చినప్పటికీ, కమిషన్ ఆ మేరకు ప్రభుత్వానికి సూచించినప్పటికీ, 50 శాతానికి రిజర్వేషన్లు మించరాదనే సుప్రీంకోర్టు తీర్పును అనుసరించే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కనబడుతున్నాయి. ఆ మేరకు బీసీలకు 23 నుంచి 24 శాతానికి సీట్ల కేటాయింపు జరిగే అవకాశాలు లేవు. కాంగ్రెస్ పార్టీ మాత్రం పార్టీ పరంగా బీసీలకు 42 శాతం టిక్కెట్లు ఇస్తామని ప్రకటించింది. రిజర్వేషన్ల లెక్క తేలితే గానీ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదు. ఏ వర్గానికి ఎంత శాతం రిజర్వేషన్లు విధిస్తారు, ఆ ప్రకారం ఏఏ స్థానాలు ఏ వర్గానికి కేటాయిస్తారనే ఉత్కంఠ వివిధ రాజకీయ పార్టీల నేతల్లో నెలకొన్నది. మార్చిలో ఇంటర్, పదవ తరగతి పరీక్షలు ఉన్నందున, పరీక్షలు పూర్తయిన తర్వాత ఎన్నికలు నిర్వహిస్తారా, అంతకంటే ముందు మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు గానీ, పంచాయతీ ఎన్నికలు గానీ నిర్వహిస్తారా అనే విషయం తెలియాల్సి ఉంది.

కరాటే విజేతకు ఘన సన్మానం


ఓదెలలో కరాటే విజేత శరణ్యను సన్మానిస్తున్న యువకులు

ఓదెల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఓపెన్ టూ ఆల్ స్టైల్ అంతర్జాతీయ కరాటే టోర్నీలో బంగారు, వెండి పతకాలను సాధించిన విజేత లగిశెట్టి శరణ్యను మండల కేంద్రంలో యువకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముంజాల మధు, వంగ రాజమల్లు, మేర్గు భీష్మ చారి, ముద్దసాని చేరాలు, బుద్దె రాజన్న, బో రామచంద్రం, ఆసంశెట్టి కృష్ణ, మీనుగు సంతోష్ పాల్గొన్నారు.

నెరవేరనున్న ఏళ్లనాటి కల

● ప్రారంభానికి సిద్ధమైన బండలవాగు ప్రాజెక్టు ● నాలుగు గ్రామాల ప్రజల్లో సంతోషం


ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు


బండలవాగు కొత్త చెరువులో ఏర్పాటు చేసిన డెలివరీ ఛానల్

పాలకుర్తి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండల ప్రజలు మూడు దశాబ్దాలుగా ఎదురు చూసిన బండలవాగు ప్రాజెక్టు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో కుక్కలగూడూర్, పుట్నూర్ , గుడిపెల్లి, జయ్యారం గ్రామాల ప్రజలు లబ్ధిపొందనున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుతుండటంతో 2018లో ప్రభుత్వం టెండర్లు వేసింది. సుమారు రూ.57 కోట్లతో బ్రాహ్మణపల్లి వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, బండలవాగు ప్రాజెక్టు పనులను కనక మేడల వరప్రసాద్(కె.ఎం.వి) కంపెనీ దక్కించుకుంది. కుక్కలగూడూర్, వేమునూర్ గ్రామాల శివారు ప్రాంతంలోని శ్రీపాద ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ వద్ద భారీ విద్యుత్ మోటార్లను బిగించి పైపుల ద్వారా 4.75 కిలో మీటర్ల దూరంలో ఉన్న బండలవాగు కొత్త చెరువులోకి నీటిని పంపుల ద్వారా పంపిస్తారు. అక్కడి నుంచి రైతులకు సాగు నీరు అందిస్తారు. వివిధ కారణాలతో నత్తనడకన సాగి ఎట్టకేలకు పైపులైను పనులు పూర్తయ్యాయి. గత జనవరి 30న ట్రయల్‌రన్ చేపట్టారు. రెండు చోట్ల పైపులు లీకైనట్లు గుర్తించి మరమ్మతు పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. బ్రాహ్మణపల్లి వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి డీ83 కాలువకు ఉప కాలువ కింద భూములు, కుక్క లగూడూర్ వద్ద ఉన్న బండలవాగు ప్రాజెక్టును నింపి దాని కింద 1,250 ఎకరాల భూమికి సాగునీరు అందనుంది.

మా భూములు సాగులోకి వస్తాయి

పానగంటి సత్తయ్య, రైతు, పుట్నూర్



బండలవాగు ప్రాజెక్టును నీటితో నింపడం ద్వారా వందల ఎకరాల భూములు సాగులోకి వస్తాయి. భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బావుల్లో నీరు పుష్కలంగా ఉంటుంది. కాలువల ద్వారా వ్యవసాయం చేసుకునే రైతులకు మరెంతో ఉపయోగం ఉంటుంది. ప్రాజెక్టును ప్రారంభిస్తే రైతుల చిరకాలవాంఛ నెరవేరుతుంది.

బీడు భూములకు సాగునీరు

మర్రి ఓదెలు, కౌలు రైతు, కుక్కలగూడూర్



బండలవాగు కొత్త చెరువును నీటితో నింపడం ద్వారా పుట్నూర్, జయ్యారం, కుక్కలగూడూర్, గుడిపెల్లి, వేమునూర్ గ్రామాల పరిధిలోని సుమారు 400 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. చాలా వరకు బీడు భూములు సాగులోకి వస్తాయి. నాలాంటి కౌలు రైతులు పంటలు సాగు చేసి బతుకవచ్చు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

మహ్మద్ నియాజ్, మున్సిపల్ కమిషనర్ సుల్తానాబాద్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

కమిషనర్: వేసవిని దృష్టిలోపెట్టుకుని సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం లీకేజీలను ఇతర మరమ్మతులను వెంట వెంటనే చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: అమృత్ పథకం ద్వారా ఎలాంటి పనులు నడుస్తున్నాయి?

కమిషనర్: సుల్తానాబాద్‌లో అమృత్ పథకం కింద రూ. 18 కోట్లతో 14 లక్షల లీటర్ల కెపాసిటీ గల పెద్ద ట్యాంకు నిర్మాణం చేపడుతున్నాం. దాంతో పాటు కొత్తగా పైప్‌లైన్లు కూడా యుద్ధ ప్రాతిపదికను నిర్మాణం చేస్తున్నాం. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : నీటి సరఫరా ఎలా ఉంది.. ఇబ్బందులు ఉన్నాయా?

కమిషనర్: పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు 13 ట్యాంకులు ఉన్నాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా నీటిని నింపుతున్నాం.

- సుల్తానాబాద్

నేతల పరామర్శ

మంథని, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మంథని మాజీ ఉప సర్పంచ్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీష్ తండ్రి ఇనుముల శంకరయ్య బుధవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. మృతదేహాన్ని మంథనిలో స్వగృహానికి తరలించగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెంద్రు రమ-సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వొడ్నాల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్లు ఉప్పట్ల సంతోషిణి, ఆకుల కిరణ్, అజీం, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ప్రజా సంఘాల నేతలు పెంద్రు సురేష్‌రెడ్డి, ఉప్పట్ల శ్రీనివాస్, తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, గోటికార్ కిషన్‌జీ, క్రాంతి, సదాశివ్, మాజీ కౌన్సిలర్లు శంకరయ్య పార్థివ దేహానికి నివాళులర్పించి సతీష్‌ను పరామర్శించారు.

అన్ని వర్గాల వారిని హింసిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మంథని, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఒకవైపు రాజ్యాంగం పట్టుకొని తిరుగుతూనే, ఆలయాలకు వ్యతిరేకం కాదని చెపుతూ మరో వైపు అన్ని వర్గాల ప్రజలను హింసిస్తున్నారని, ఇందుకు చిలుకూరు ఆలయ పూజారి రంగరాజన్‌పై దాడే నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. తన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై చిలుకూరి బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్ మాట్లాడిన మాటలు మేధావులకు జ్ఞానోదయం కల్గించాలన్నారు. రంగరాజన్‌పై వీరరాఘ వరెడ్డి దాడిని మంథని ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నేడు చాలా మంది తాము


మాట్లాడుతున్న పుట్ట మధు

మేధావులమని గొప్పలు చెప్పుకుంటున్నారని, రాజ్యాంగాన్ని కొందరికే పరిమితమని ప్రచారం చేస్తున్నారన్నారు. అలాంటి వాళ్లకు జ్ఞానోదయం కల్గించేలా రంగరాజన్ తాను రాజ్యాంగాన్ని అనుసరించే పనిచేస్తున్నానని చెప్పడం గొప్ప విషమన్నారు. రంగరాజన్‌పై దాడి చేసిన వీరరాఘవరెడ్డి వెనకాల ఎవరు ఉన్నారో బయటకు తీయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, కన్నూరి శ్రీశైలం, కాయితీ సమ్మయ్యలు, గుజ్జుల రాజిరెడ్డి, పెగడ శ్రీనివాస్ ఉన్నారు.

సంతు రవిదాస్ మహారాజ్‌కు నివాళి

సంతు రవిదాస్ మహారాజ్ 640 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ నేతలు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దక్షణ భారత దేశ సమితి రవిదాస్ సంగటి సమన్వయ కర్త కౌండన్య శ్రీశైలం మహదేవ్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలు కోసం, ప్రజాస్వామిక పాలనకోసం, కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్ కార్యక్రమంలో వేలాదిగా ప్రజలు పాల్గొనాలని కోరుతూ ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని ఫైలాన్ చౌరస్తా వద్ద చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఈ నరేష్, ఈ రామకృష్ణ, జీ మల్లేశం, ఐ రాజేశం, ఎస్ రాజన్న, ఎం దుర్గయ్య, ఎడ్ల రవికుమార్, పీ మొండయ్య, ఎస్ ప్రసాద్, ఐ సాంబయ్య, గంధం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరి ఆలయ అర్చకుడిపై దాడి దురదృష్టకరం

సుల్తానాబాద్ , ఫిబ్రవరి 12: (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి దురదృష్టకరమైన సంఘటన అని ఇలాంటి సంఘటనలు పునరావృతం జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా వైష్ణవ సంఘం అధ్యక్షులు కాండూరి వాసు డిమాండ్ చేశారు. ఎంతో ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత ఉద్యోగాన్ని వదిలివేసి భగవత్ సేవలో ఉన్న రంగరాజన్‌పై దాడి చేసిన కఠినంగా శిక్షించాలన్నారు.

సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న భక్తులు

● మొదలైన మినీ జాతర

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క సారలమ్మ మినీ జాతర సందర్భంగా మండలంలోని తుర్కలమద్దికుంట పరిధిలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద బుధవారం గ్రామస్థులు, జాతర కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర కమిటీ అధ్యక్షులు ముత్యాల తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద మినీ జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మల్లేశం, ప్రధాన కార్యదర్శి శంకరయ్య, సహాయ కార్యదర్శి ముత్యాల జగన్, కోశాధికారి కనకట్ల స్వామి, కొండ భూమయ్య, మామిడి లక్ష్మయ్య, ముత్యాల రాజమౌళి పాల్గొన్నారు.

ధర్మారం : మండల కేంద్రంలో సమ్మక్క సారక్క చిన్న జాతర ఉత్సవాలు బుదవారం నుంచి ప్రారంభం అయ్యాయి. జాతర ఈ నెల 15 వరకు జరుగుతుందని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులు దేవి జనార్ధన్, మెడవేని తిరుపతి, ఓరెం చిరంజీవి తెలిపారు. వచ్చే సంవత్సరం నిర్వహించే జాతరకు భక్తులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని ఇందుకు మండల వ్యాపారస్థులు, కుల సంఘాలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని వారు కోరారు. దేవి లక్ష్మిరాజం, అర్దవెళ్లి రామ్, భక్తులు పాల్గొన్నారు.

ఓదెల : మండలంలోని కొలనూర్ గుట్టల్లోని సమ్మక్క, సారలమ్మ గద్దెలను బుధవారం కొలనూర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు దర్శించుకున్నారు. పౌర్ణమి సందర్భంగా మేడారంలో మినీ


కొలనూర్‌లో సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు


పెంచికల్‌పేటలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సమ్మక్క సారలమ్మ జాతర కొనసాగుతున్న నేపథ్యంలో, ఇక్కడి మనదేవతలను దర్శించుకొని బంగారాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ సర్పంచ్ సామ శంకర్, జాతర మాజీ చైర్మన్లు, అలాగే మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య, దొడ్డే శంకర్, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి చందు, మత్స్యశాఖ అధ్యక్షుడు రేగుల తిరుపతి, మాజీ అధ్యక్షుడు కోమల్ల సూదన్, సాతూరి రాజేశం వీర్లసదయ్య, మద్దెల నర్సయ్య, కొల్లూరి రాజేశం, శంకరయ్య, రవి తో పాటు పలువురు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : కమాన్‌పూర్ మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలో సమ్మక్కసారక్క మినీ జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా కోయ పూజారులు సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. మినీ సమ్మక్క, సారక్క ఉత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని కోరారు. పెంచికల్‌పేట గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర కన్నుల పండువగా జరిగింది.

మంథనిరూరల్: మండలంలోని ఖానాపూర్ గ్రామ శివారులో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామస్థులు శ్రీసమ్మక్క-సారక్క తల్లుల జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులతో పాటు చట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున శ్రీసమ్మక్క-సారక్క తల్లుల గద్దెల వద్దకు చేరుకొని మొక్కులు చెల్లించుకొని వన భోజనాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

● డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో మార్చిలోపు 100శాతం ఆస్తిపన్ను వసూలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి చెప్పారు. బుధవారం కార్పొరేషన్‌లో మొండి బకాయిదారుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నాటికి ప్రైవేట్ ఆస్తుల ఇంటి పన్ను 53శాతం, ప్రభుత్వ ఆస్తుల నుంచి 92శాతం వసూలు కాగా ఏళ్ల తరబడి వసూళ్లు కాని భారీ బకాయిలను వసూలు చేయడానికి రెవెన్యూ చట్టం ప్రకారం ఇచ్చిన నోటీసులకు స్పందన వచ్చిందని, ఇదే తరహాలో మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చి ఫిబ్రవరిలోగా చెల్లించకపోతే చట్ట ప్రకారం ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందన్నారు.



ఆర్జీ-2లో సీఎంపీఎఫ్ కోఆర్డినేషన్ సమావేశం



అధికారులతో చర్చిస్తున్న సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచోరి బుధవారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో ఏరియా అధికారులతో సీఎంపీఎఫ్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ ఆఫీస్ ద్వారా కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి మెంబర్ మాస్టర్ డేటాను సమర్పించడం, 2024 నవంబరు 11 నాటి లెటర్ ఆధారంగా సీ- కేర్స్‌లోని సబ్‌స్క్రైబర్‌ల డేటాను సవరించడం అంశాలను వివరించారు. కాంట్రాక్టు కార్మికుల కవరేజీ, పీఎఫ్-5 డిపాజిట్ సకాలంలో డిపాజిట్ జరపడం, తప్పనిసరి రాబడి విషయాలపై చర్చించారు. రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికుల సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీలో వీవీ సకాలంలో సమర్పించడం, సవరించిన పెన్షన్ క్లెయిమ్ సెటిల్మెంట్, సీ- కేర్స్ పోర్టల్‌లో ఎస్ఓపీ ప్రకారం అడ్వాన్స్ క్లెయిమ్‌ల సమర్పణ వంటి అంశాలపై చర్చించారు. ఏరియా పరిధిలోని ఉద్యోగుల సీఎంపీఎఫ్ సమస్యను అధికారులు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం పర్సనల్ అనిల్ కుమార్, అధికారులు వెంకటరామచంద్ర, మహమ్మద్ షరీఫ్, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, అసిస్టెంట్ సెక్రెటరీ శ్యాంసన్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన నాయకులు

గోదావరిఖని, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని సీఎంఓ ఏఐ ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు, జాయింట్ సెక్రెటరీ కిరణ్ రాజ్‌కుమార్ తదితరులు సీఎండీ కోరారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ-8 ఇంటర్వ్యూలు నిర్వహించి త్వరితగతిన పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా డైరెక్టర్లుగా నియమితులైన ఎల్‌వీ సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లును సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, జక్కరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోళ్లు దొరకక జనం అవస్థలు

● వనదేవతల మొక్కుల చెల్లింపునకు ఇబ్బందులు



మంథని, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక చికెన్ మార్కెట్‌లో కోళ్లు దొరకక జనం బుధవారం అవస్థలు పడ్డారు. మాఘ పౌర్ణమి కావడంతో పాటు బుధవారం కలిసి రావడంతో వన దేవతలైన శ్రీసమ్మక్క-సారక్కలకు మొక్కులు చెల్లించుకోవటానికి ప్రజలు మార్కెట్‌లోని చికెన్ సెంటర్ల వద్ద ఉదయం నుంచి బారులు తీరారు. పెద్ద ఎత్తున జనం కోళ్లను కొనుగోలు చేయడంతో మధ్యాహ్నం 12 వరకే మార్కెట్‌లోని దాదాపు 20 షాపుల్లో మొత్తం కోళ్లు అమ్ముడు పోవడంతో ఆ తర్వాత కోళ్ల కోసం మార్కెట్‌కు వచ్చిన వారు కోళ్లు లేక పోవడంతో అవాక్కయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి సైతం కోళ్లు వచ్చే పరస్థితి లేక పోవడంతో అమ్మడానికి కోళ్ళు, చిక్కెన్ లేక మార్కెట్‌లో వ్యాపారులు సైతం ఖాళీగా కూర్చున్నారు. కోడి లేక, చికెన్ దొరకక ప్రజలు బేజార్ అయ్యారు. దీంతో కొంత మంది కోడి లేకుండానే వన దేవతలకు మొక్కులు చెల్లించుకొని ఆదివారం కోళ్ల కోసుకోవటానికి సన్నాహాలు చేసుకున్నారు. దీంతో మార్కెట్ మధ్నాహ్నం నుంచి రాత్రి వరకు చికెన్ సెంటర్లు జనం లేక వెలవెలబోయాయి. ప్రతి ఆదివారం, బుధవారల్లో మంథని చికెన్ మార్కెట్‌లో సుమారు 2 టన్నుల వరకు కోళ్లను విక్రయిస్తుండగా ఈ రోజు మాత్రం మేడారం శ్రీసమ్మక్క- సారక్క మొక్కులతో దాదాపు 4 టన్నుల పైగా అమ్మకాలు కొనసా గాయి. దీంతో మధ్యాహ్నం వరకే కోళ్లు ఖాళీ అయ్యాయి. ఒక వైపు బర్డ్ ఫ్లూతో చికెన్ తినే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం సూచిస్తున్న క్రమంలో జనాలు కోళ్ల కోసం ఎగబడ్డారు.

వన దేవతలకు పూజలు నిర్వహించిన ఆర్‌జీ-1 జీఎం

గోదావరిఖని, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గోదావరినది పరివాహక ప్రాంత వన దేవతలైన శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను బుధవారం ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగరేణి సంస్థ ద్వారా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న పలు ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లడుతూ సింగరేణి సీఎండీ, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచనల మేరకు ఎంతో మహిమ గల అమ్మవారి దేవాలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయుటకు అనుమతులు వచ్చాయని, వారి సూచనల మేరకు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఏర్పాట్ల కోసం సంబంధిత అధికారులతో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్, ఏరియా ఇంజనీరు దాసరి వెంకటే శ్వర్‌రావు, ఐఈడీ ఆంజనేయులు, ఎన్విరాన్‌మెంట్ ఆంజనేయ ప్రసాద్, ఏరియా వర్క్‌షాప్ జితేందర్‌సింగ్, ఎస్‌సీ సివిల్ వరప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి, జెక్కుబోయిన కనకయ్య, మోహన్ రెడ్డి, బంగారు చిన్న రాజన్న, వెంకన్న, సాయిలు, జనగామ సాయిలు, ఆర్కుటి రాయమల్లు, రాంచందర్, సుందర్ రాజు, నగేష్, భూమయ్య, ఉదరి కనకయ్య, వెంకన్న, ఆశలు, ఈశ్వర,ఎర్ర మల్లయ్యపాల్గొన్నారు.


మొక్కులు చెల్లించుకుంటున్న ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● మక్కాన్‌సింగ్ సేవాసమితి చెర్మన్ మనాలి ఠాకూర్

పాలకుర్తి,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మెన్ మనాలి ఠాకూర్ అన్నారు. బుధవారం ఆమె మండలం పరిధిలోని పుట్నూర్ గ్రామంలో ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ సమస్యల పరిష్కారం కోసం సహకారం అందిస్తానని తెలిపారు. పుట్నూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు తోట ప్రశాంత్,మండల రైతు సంఘం నాయకులు నార సత్తయ్య, మాదాసు రాజు, బంద్రి వేణు, యువజన నాయకుడు సప్తగిరి,దుర్గం మల్లేష్ ,మాదాసు శ్రావణ్, శ్రీకాంతచారి న్నారు.అనంతరం ఒడ్డెర కాలని, నేతకాని కాలనీ వాసులకు చేతి పంపు నిర్మాణం కోసం 50 వేల రూపాయలను ఆమె అందించారు.


మాట్లాడుతున్న మనాలి ఠాకూర్